క్లుప్తంగా

ఘనంగా దర్గా గంధోత్సవం



దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

సిద్దవటం : మండల కేంద్రంలోని మట్లి రాజుల కోట వద్ద ఉన్న హజరత్ సయ్యద్‌షా బిస్మిల్లా షా ఖాద్రి దర్గాలో ఆదివారం గంధం మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్టు ముత్తవలీ సయ్యద్ షా ముగ్దూమ్‌పీర్ ఖాద్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ హజరత్ సయ్యద్‌షా బిస్మిల్లా షా ఖాద్రి దర్గాలో గంధం మహోత్సవం సందర్భంగా వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశామన్నారు. సాయంత్రం దర్గాలో గంధం అర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేసి ఫతేహా చేశామన్నారు. సోమవారం ఉరుసు ఉంటుందని తెలిపారు.

ఘనంగా ముగిసిన గంగమ్మ జాతర



జాతరలో కోలాటం ఆడుతున్న దృశ్యం

వీరబల్లి : మండల కేంద్రంలోని గంగమ్మ ఆలయంలో జాతర శని, ఆదివారాల్లో ఘనంగా నిర్వహించారు. ఆలయంలో శనివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు పలు రూపాలలో అమ్మవారికి ముడుపులు చెల్లించారు. చాందినీ బండ్లు, కుంకుమ బండి, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆదివారం బోనాలు పట్టుకొని ఈ జాతరను నిర్వహించారు. ఈ ఏడాది జాతరకు విశేష స్పందన వచ్చింది. జాతరకు రాయచోటి, కడప, హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు తదితర ప్రాంతాల నుంచి బంధువులను పిలిపించుకొని వైభవంగా జరుపుకున్నారు.

నల్ల గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



దర్శనానికి వచ్చిన భక్తులు

సంబేపల్లె : మండల కేంద్రంలోని దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయాన్ని వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చకులు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆక్యుపంక్చర్ వైద్యశిబిరం



ఆక్యుపంక్చర్ వైద్యం చేస్తున్న డాక్టర్ గిరీష్

రాజంపేట రూరల్ : కడపకు చెందిన సీనియర్ ఆక్యుక్చరిస్ట్, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ గిరీష్‌దేవపురం స్థానిక రాజు హైస్కూల్‌లో ఆదివారం ఉచిత ఆక్యుపంక్చర్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో పలువురికి ఆక్యుపంక్చర్ వైద్యం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో కీళ్లనొప్పులు, నడుమునొప్పి, సయాటికా, భుజమునొప్పి, మైగ్రీన్స్, నిద్రలేమి, పక్షవాతం వంటి సమస్యలతో పాటు ఆక్యుపంక్చర్ చేయబడే వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో రాజు స్కూల్ సీఈఓ వి.మోహన్‌రెడ్డి, ప్రిన్సిపల్ కె.రఘురామరాజుతో పాటు రాజంపేట మండలంతో పాటు సమీప మండలాలకు చెందిన పలువురు వ్యాధిగ్రస్తులు పాల్గొన్నారు.

పరామర్శ

సుండుపల్లె (వీరబల్లి) : మండలంలోని ఎగువ ఈడిగపల్లె గ్రామస్తుడు ఏ.గరుడయ్య కుమారుడు శ్రీనివాసులు ఇటీవల మృతి చెందాడు. ఆదివారం శ్రీనివాసులు దశదిన ఖర్మకాండలో రాజంపేట ఎమ్మెల్యే మేడా వెంకటమల్లికార్జున రెడ్డి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి మృతుని కుటుంబానికి పరామర్శించి, ప్రభుత్వం నుంచి అందాల్సినటువంటి సహాయ సహకారాలు అందిస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మండల ఎంపీపీ రాజమ్మ, జెడ్పీటీసీ ఇస్మాయిల్, మండల సీనియర్ నాయకుడు బీఎల్ నరసింహారెడ్డి, సచివాలయ కన్వీనర్ కేతిరెడ్డి కృష్ణారెడ్డి, ఎర్రపురెడ్డి ఆనంద్‌రెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, కె.మహేశ్వర్ రెడ్డి, మండల మైనార్టీ నాయకుడు రెహమాన్ ఖాన్, ముడుంపాడు సర్పంచ్ రామస్వామి రెడ్డి, రాయవరం సర్పంచ్ షరీఫ్, మంత్రి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్ట్

పీలేరు రూరల్ : పది లీటర్ల సారాతోపాటు ఓ నిందితున్ని అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ వై. గురుప్రసాద్ తెలిపారు. వివరాలిలావున్నాయి. మండలంలోని తలపుల పంచాయతీ వడ్డిపల్లెలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు అందిన సమాచారంతో సెబ్ సిబ్బంది దాడి చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పి. రాజశేఖర్ సారా కలిగి ఉండగా అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

కుండ నీరు.. అలసట తీరు

- వేసవి దృష్ట్యా మట్టికుండల కొనుగోలుకు పెరిగిన డిమాండ్
- ఆరోగ్యానికి శ్రేయస్కరం అంటున్న వైద్య నిపుణులు



విక్రయానికి సిద్ధంగా ఉన్న నలుపు రంగు కుండలు

సంబేపల్లె : ఇంత కాలం మట్టి కుండలవైపు కన్నెత్తి చూడని వారు నేడు వాటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. సహజసిద్ధంగా నీటిని చల్లబరిచే గుణమున్న మట్టి కుండలోని నీరు తాగడం ఆరోగ్యానికి శ్రేయష్కరమంటూ నిపుణులు పేర్కొంటుడటంతో వాటి పట్ల పలువురు ఆకర్షితులవుతున్నారు. మండుతున్న ఎండల్లో తిరిగి అలసటగా ఇంటికి చేరుకున్నపుడు ఓ గ్లాసుడు మట్టి కుండలోని నీరు తాగితే ఊరటగా ఉంటుందని అనుభవ పూర్వకంగా తెలుసుకున్న వారు బాహాటంగా పేర్కొంటున్న అక్షరసత్యమిది. ఎంతో ఖరీదైన ఫ్రిజ్‌లున్నా ధనవంతులు సైతం నేడు మట్టి కుండలోని నీటిని తాగేందుకు ఇష్టపడుతున్నారంటే వీటి ప్రాముఖ్యత ఏంటో అర్థం చేసుకోవచ్చు.

రెండు దశాబ్దాల క్రితం మట్టి పాత్రల వినియోగించే వారు. గ్రామీణులతో పాటు పట్టణవాసులు సైతం మట్టి పాత్రల్లో సిద్ధం చేసిన వంటకాలను నిల్వ చేసిన నీటిని తాగేవారు. అయితే కాలానుగుణంగా వచ్చిన మార్పుల దృష్ట్యా మట్టి కుండల పాత్రను ఫ్రిజ్‌లు ఆక్రమించాయి. దీనివల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తి అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఎంతైనా ఫ్రిజ్ ఉండగానే ఇంటిలో మట్టికుండ వాడుతున్నారంటే.. ఆ కుండకు ఉన్న ప్రత్యేకత ఏందో ఇప్పటికైనా జనాలకు తెలిసినట్టుంది.

రేడియేషన్‌తో ఆరోగ్యానికి చేటు

టెక్నాలజీ మనిషి జీవితాన్ని ఎంతో ప్రభావితం చేసింది. ఒకప్పుడు ప్రకృతి అందాలు, పక్షుల కిలకిలరావాల మధ్య జీవనం ఉండేది.. నేడు యాంత్రిక జీవనంలో భాగమైపోయాం. సెల్‌టవర్లు, ఏసీలు, కంప్యూటర్లు, టీవీలు, ఫ్రిజ్‌లు, ఓవెన్‌లు, సెల్‌ఫోన్లు తదితర రేడియేషన్ ఉత్పత్తి చేసే పరికరాల మధ్య జీవిస్తున్నాం. దీనివల్ల దుష్పరిణామాలు ఉన్నాయని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. శరీరం రేడియేషన్‌కు గురైతే దీర్ఘకాలిక వ్యాధుల బారినపడక తప్పదంటున్నారు. ఫ్రిజ్‌లోని నీరు తాగడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయనేది అనుభవపూర్వకంగా తెలుసుకున్న వారు వివరిస్తున్నప్పటికీ వివిధ కారణాల వల్ల ఫ్రిజ్ వాడకాన్ని మాత్రం తగ్గించలేమనేది వాస్తవం. అయితే మట్టి కుండలోని నీరు తాగడం, మట్టి పాత్రల్లో సిద్ధం చేసి వంటకాలు తీసుకోవడం వల్ల మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చునని నిపుణులు చెబుతున్నారు. కుండల తయారీకి అవసరమైన బంకమట్టిని గ్రామీణ ప్రాంతాల నుంచి దిగుబడి చేసుకోవాల్సి వస్తోందని కుండ తయారీదారులు చెబుతున్నారు. ఒక్కో బండి మట్టికి రూ.వెయ్యి వరకు డిమాండ్ చేస్తున్నారన్నారు. కాగా వేసవికి రెండు నెలల ముందు నుంచి మాత్రమే కుండల తయారీ చేపడుతున్నామన్నారు. సైజును బట్టి రూ.100, 200, 300 వరకు కుండలను అమ్ముతున్నట్లు తెలిపారు.

కులవృత్తిని కొనసాగిస్తున్నా



పూర్వీకుల నుంచి సంక్రమించిన మట్టికుండల తయారీని నేటికి కొనసాగిస్తున్నాను. సమాజంలో ఎన్నో కొత్తగా వస్తువులు వచ్చినప్పటికీ మట్టికుండలకు గిరాకీ తగ్గలేదు. కుండల తయారీని వేసవి రాక మునుపే పనులు ప్రారంభించి వేసవికి ప్రజలకు అన్ని రకాల కుండలను అందుబాటులో ఉంచుతాం.

– రమణయ్య, కుండల తయారీదారుడు, సంబేపల్లె

కుండ నీళ్కు ఆరోగ్యానికి మంచిది



ప్రతి సంవత్సరం ఎండకాలం వచ్చేసరికి నాణ్యమైన మట్టికుండను తీసుకెళ్లి ఇంటి దగ్గర ఇసుకపోసి దానిపై మట్టికుండను పెట్టి నీళ్ళుపోస్తాను. పిల్లలు కుండ నీరు తాగడానికి చాలా ఇష్టపడతారు. ఎండలకు కుండలోని నీరు తాగడం వలన శరీరానికి ఆరోగ్యం చేకూరుతుంది.

– శ్రీనివాసులు, గాండ్లపల్లె, సంబేపల్లె

కంచె తొలగించండి.. సారూ!



దారి అడ్డంగా కంచెను ఏర్పాటు చేసిన దృశ్యం

సుండుపల్లె (వీరబల్లి) : మండల కేంద్రంలోని పొలిమేరపల్లి గ్రామ పంచాయతీలో ఉన్నటువంటి చిన్న గొల్లపల్లిలో దారికి అడ్డంగా వేసిన కంచెను తొలగించాలని స్థానికులు అధికారులను వేడుకుంటున్నారు. ఈ విషయమై గత వారం రోజుల క్రితం స్థానికులైన అమ్మడిసాని చిన్నప్ప, నేతి రాసయ్యలు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్ళినప్పటికీ ఏమాత్రం చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా చిన్న గొల్లపల్లిలో ఫ్లోరైడ్ వాటర్ సమస్య ఉన్నందున బయట నుంచి మినరల్ వాటర్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దారికి అడ్డంగా కంచె వేయడంతో గత పది రోజుల నుండి ఫ్లోరైడ్ నీటిని తాగడం వలన చిన్న పిల్లలు అనారోగ్యానికి గురికావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయంలో సైతం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని తెలిపారు. ఈ దారి సమస్య కోర్టులో ఉండగానే బొగ్గడం వెంకటసుబ్బయ్య అలియాస్ (చిన్నప్ప) అనే వ్యక్తి దారికి అడ్డంగా కంచె వేశారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు సత్వర చర్యలు తీసుకొని దారికి అడ్డంగా ఉన్నకంచెను తొలగించాలని కోరారు.

జిల్లా కేంద్రాన్ని మారుస్తామనడం హాస్యాస్పదం

నారా లోకేష్ ప్రజలను మభ్యపెట్టే ప్రకటనలు చేయడం మానుకోవాలి



ఫయాజ్‌బాషా

రాయచోటి అర్బన్ : టీడీపీ అధికారంలోకి వస్తే జిల్లా కేంద్రాన్ని మారుస్తామని టీడీపీ నేత లోకేష్‌బాబు ప్రకటించడం హాస్యాస్పదమని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్ బాషా అన్నారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువగళం పేరుతో లోకేష్ చేస్తున్న పాదయాత్రకు జనం నుంచి స్పందన లేదన్నారు. దీంతో ప్రజలను మభ్యపెట్టే ప్రకటనలు చేస్తూ ముందుకు సాగుతున్నారంటూ ఎద్దేవా చేశారు. మదనపల్లెను జిల్లా కేంద్రం చేస్తామని ప్రకటిస్తూ ప్రజల నడుమ ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తుండటం తగదన్నారు. జగనన్న సీఎం అయ్యాక నిష్ణాతులైన కమిటీ సభ్యులతో ప్రజాభిప్రాయాన్ని సేకరించి నైసర్గికంగా, భౌగోళికంగా రాజంపేట పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని అన్ని నియోజకవర్గాలకు అనుకూలంగా ఉండే రాయచోటిని జిల్లా కేంద్రంగా చేశారన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో సమాన అభివృద్ధి సాధించేందుకు జాతీయ రహదారులను మంజూరు చేయించారన్నారు. పాదయాత్రలో ప్రజలకు ఏదో ఒకటి చెప్పాలి, మభ్యపెట్టాలనే ఉద్దేశంతో లోకేష్ మదనపల్లెను జిల్లా కేంద్రంగా చేస్తామని ప్రకటించారంటూ ఆయన మండిపడ్డారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఎలాంటి అభివృద్ధి జరగలేదని, అభివృద్ధి గురించి కనీసం చర్చ కూడా జరగలేదన్నారు. టీడీపీ నేతల రాజకీయ స్వార్థం కోసం అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న అన్నమయ్య జిల్లాలో విభజన పేరుతో చిచ్చుపెట్టాలని చూడడాన్ని ప్రజలు సహించబోరన్నారు. ఇప్పటికైనా లోకేష్ ప్రాంతీయ విభేధాలు సృష్టించే మాటలను మానుకోవాలని, లేనిపక్షంలో ప్రజలు బుద్ధి చెబుతారంటూ ఆయన హితబోధ చేశారు.

విద్యుత్‌శాఖలో లైన్‌మెన్‌లే కీలకం



లైన్‌మెన్‌ను సన్మానిస్తున్న అధికారులు

రాయచోటి టౌన్ : విద్యుత్‌శాఖలో లైన్‌మెన్లు చాలా కీలకమని రాయచోటి విద్యుత్‌శాఖ డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. లైన్‌మెన్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం లైన్‌మెన్ల సన్మాన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్‌శాఖలో లైన్‌మెన్ల ప్రాముఖ్యత గొప్పదని రాష్ట్ర ప్రభుత్వం వీరి కోసం మార్చి 4ను లైన్‌మెన్ల దినోత్సవంగా మొదటి సారిగా గుర్తించినట్లు తెలిపారు. లైన్‌మెన్లు నిరంతరం ప్రజలకు దగ్గరగా ఉంటూ సేవలందిస్తుంటారని చెప్పారు. కార్యక్రమంలో ఏడీ తిరుపాల్ నాయక్, ఏఈలు నాగరాజు, పీరా సాహెబ్, రమేష్, లైన్‌మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎనర్జీ సెక్రటరీలను ఉద్యోగులుగా గుర్తించండి

గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ డిమాండ్



మాట్లాడుతున్న మంజునాథ్

రాయచోటి అర్బన్ : ఎనర్జీ సెక్రటరీలను బానిసలుగా కాకుండా ఉద్యోగులుగా గుర్తించాలని గ్రామ, వార్డు సచివాలయాల ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జునరెడ్డి, మంజునాథ్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సీఆర్‌రెడ్డి డిగ్రీ కళాశాలలో ఆ సంఘం జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన వారు మాట్లాడుతూ జేఎల్‌ఎం గ్రేడ్-2లు గ్రామ సచివాలయం, విద్యుత్‌శాఖ అధికారుల నడుమ నలిగిపోతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. కొందరు ఎంపీడీఓలు ఆఫీసు పనివేళల్లో తప్పనిసరిగా బయోమెట్రిక్ వేయాలని హుకుం జారీ చేస్తున్నారన్నారు. మరికొన్ని చోట్ల తాము చెప్పిన పనులనే చేయాలంటూ ఆదేశిస్తున్నారని, చేయనిపక్షంలో షోకాజ్ నోటీసులు ఇస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సంస్థల సర్వీసు రూల్స్ ప్రకారం జీతాలు, అలవెన్సులు చెల్లించాలన్నారు. ఏపిటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ మాట్లాడుతూ ఇప్పటికే విధులలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 100 జేఎల్‌ఎం గ్రేడ్-2లు మరణించగా, మరో 200 మంది అంగవైకల్యం చెందారన్నారు. విధుల్లో భాగంగా ఎక్కడ ఏ సంఘటన జరిగినా జేఎల్‌ఎం గ్రేడ్- 2 లను బాధ్యులను చేస్తున్నారన్నారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి సుధీర్‌బాబు, కడపజిల్లా అధ్యక్ష, కోశాధికారులు కృపాకర్, శ్యామ్, అన్నమయ్య జిల్లా నేతలు రెడ్డి రాజు, రమణ, దర్బార్‌తో పాటు పలువురు ఎనర్జీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం.. మల్లూరమ్మ

- జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు
- 7న నిండు తిరునాలు, 8న మైల తిరునాల



మల్లూరమ్మ మూలవిరాట్

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం కొత్తపల్లెలో వెలసిన మల్లూరమ్మ భక్తులపాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. ఈ నెల 7వ తేదీ సోమవారం నుంచి రెండు రోజులపాటు తిరునాల నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 7న నిండు తిరునాల, 8న మైల తిరునాలను నిర్వహించనున్నారు. ఈ నెల 7వ తేదీ రాత్రి అమ్మవారికి తిమ్మారెడ్డిగారిపల్లె నుంచి మంగళవాయిద్యాలతో ఆలయం వద్దకు పల్లకీలో తీసుకువచ్చి ఉదయం సిద్ధలపూజ, బోనాలు, సంతానం లేని వారు అమ్మవారికి వరపడుట అనంతరం అమ్మవారికి పూజలు ప్రారంభమవుతాయి. ఉదయం అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ, ప్రసాదం వితరణతోపాటు జాతరకు వచ్చే వారికి ఉచిత భోజన వసతి ఏర్పాటు చేశారు. అదే విధంగా మొక్కుబడులు తీరిన భక్తులు చాందినీ బండ్లు ఆలయం చుట్టూ తిప్పి మొక్కుబడులను తీర్చుకుంటారు. 8న సాయంత్రం అమ్మవారిని సాగనంపడంతో తిరునాల ముగియనుంది. పూలతో అమ్మవారి మూలవిరాట్ అలంకరణ, విద్యుత్ దీపాలతో అమ్మవారి గుడి అలంకరించారు. ఈ జాతరకు మల్లూరు కస్బా నుంచి చౌడేశ్వరీదేవి అమ్మవారు జ్యోతులతో మల్లూరమ్మ సన్నిధికి ఊరేగింపుగా రానున్నారు. అదే విధంగా తిరునాలలో జబర్దస్త్ కమెడియన్లు అలరించనున్నారు. అదే విధంగా వివిధ వినోద కార్యక్రమాలు, బాణాసంచా ఏర్పాటు చేశారు. జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన తిరునాలకు జిల్లా వాసులే కాకుండా చెన్నై, బెంగళూరు, అనంతపురం, చిత్తూరు తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు రానున్నారు. లోక్‌సభ ప్యానెల్ స్పీకర్, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డితో పాటు చీఫ్ విప్ శ్రీకాంత్ రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ జకియాఖానం, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి తదితరులు జాతరకు విచ్చేయనున్నారు. తిరునాలను దృష్టిలో ఉంచుకొని రాయచోటి డీఎస్పీ శ్రీధర్ సూచనలతో రాయచోటి రూరల్ సీఐ లింగప్ప, ఎస్ఐ రమేష్‌బాబులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. పోలీసు సిబ్బందితో గట్టి బందోబస్తును కల్పిస్తున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా అన్ని ఏర్పాట్లను చేసినట్లు దేవాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ శంకరబాలాజీ, ఆలయ ఈఓ కొండారెడ్డిలు తెలియజేశారు.

సామాన్య భక్తులకు పెద్దపీట



జాతరకు వచ్చే సామాన్య భక్తులకు పెద్దపీట వేసేలా అధికారులను, పోలీస్ యంత్రాంగాన్ని ఆదేశించాం. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆలయ కమిటీకి సూచించాం. మల్లూరమ్మ జాతరను దిగ్విజయం చేస్తాం.

– దేవనాథరెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్

జాతరకు పూర్తయిన ఏర్పాట్లు



మల్లూరమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులు జాతర ప్రాంగణాన్ని పరిశీలించి తగు సూచనలు, సలహాలను అందజేశారు. జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాం. అందరి సమన్వయంతో జాతరను జరుపుతాం.

– భూమసాని అంజలి, సర్పంచ్, కొత్తపల్లె

పకడ్బందీ ఏర్పాట్లు



మల్లూరమ్మ తల్లి జాతరకు పకడ్బందీ ఏర్పాట్లను చేశాం. అన్నమయ్య జిల్లా నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల రాకను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరికీ అమ్మవారి దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేశాం.

– శ్యాంచందర్, ఎంపీటీసీ, మల్లూరు

సమష్టి కృషితో ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకుందాం

రాజంపేట రూరల్ : పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థులను అందరం సమష్టిగా కృషి చేసి గెలిపించుకుందామని ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జునరెడ్డి కోరారు. జాతీయ రహదారిపై నున్న మేడా నిలయంలో ఆదివారం ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్లు, మండల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికలలో ఏఏ అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలో వివరించారు. ఓటు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సామాజిక మాధ్యమాలను ఉదాహరణగా చూపిస్తూ అవగాహన కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఓటరుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ విధంగా మేలు చేస్తున్నారో వివరించాలన్నారు. రాష్ట్రంలో పెను మార్పులకు నాంది పలుకుతున్న జననేతకు ఎమ్మెల్సీ ఎన్నికలలో అండగా ఉండి సహకరించాలని కోరారు. సమావేశంలో సీనియర్ నాయకులు కొండూరు శరత్‌కుమార్‌రాజు, పి.సుధాకర్, వి.గంగిరెడ్డి, వి.రమణ, గోపాలరావు, కె.విశ్వనాథరాజు, బోనం మోహన్, ఒంటిమిట్ట ఎంపీపీ జి.జనార్ధనరెడ్డి, ఎస్.రామకృష్ణతోపాటు నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అభ్యర్థుల గెలుపు మనందరి బాధ్యత

పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించుకోవడం మనందరి బాధ్యతని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి తెలియజేశారు. మండల పరిధిలోని ఆకేపాడులోని ఆకేపాటి ఎస్టేట్‌లో ఆదివారం ఎమ్మెల్సీ ఎన్నికల కో-ఆర్డినేటర్లు, మున్సిపల్ కౌన్సిలర్‌లతో సమావేశం నిర్వహించి అందరి బాధ్యతలను వివరించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, వైస్ చైర్మన్ మర్రి రవి, సీనియర్ నాయకులు చొప్పా ఎల్లారెడ్డి, పోలా వెంకటరమణారెడ్డి, జి.వెంకటసుబ్బారెడ్డి, వడ్డే రమణ, ఎస్ ఈశ్వరయ్య, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈ.వెంకటసుబ్బారెడ్డి, కె.రఘురామిరెడ్డి, దండు గోపి, ఎస్.నవీన్‌కుమార్, ఎస్.జావీద్‌అలీ, మసూద్ అలీఖాన్, పి.విశ్వనాథరెడ్డి, జి.బాలకృష్ణ, డి.భాస్కర్‌రాజు, జేవీ కృష్ణారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వీరబల్లి: పట్టభద్రులతో ఎమ్మెల్యే మేడా, వీరనాగిరెడ్డి



రాజంపేట రూరల్: దిశానిర్దేశం చేస్తున్న జెడ్పీ చైర్మన్

ప్రచారంలో..

వీరబల్లి : రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి ఆదేశాల మేరకు వీరబల్లి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు గాలివీటి వీరనాగిరెడ్డి అధ్యక్షతన మండలంలోని పట్టభద్రులకు ఎమ్మెల్సీ ఎన్నికలు సందర్భంగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్చి 13వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలలో పశ్చిమ రాయలసీమ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి ఓట్లువేసి, వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శివరాం గౌడ్, వీఆర్ స్కూల్ చైర్మన్ వీఆర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు నాగభూషణం, సొసైటీ ప్రెసిడెంటు రామాంజుల రెడ్డి, తాటిగుంటపల్లి సర్పంచ్, ఎంపీటీసీలు గోపిరెడ్డి, పురుషోత్తం రెడ్డి, డి.రామచపల్లి సర్పంచ్ రవికుమార్, సంఘం వాండ్లపల్లి, గడికోట, సానిపాయి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఏపీకి బ్రాండ్ అంబాసిడర్ సీఎం జగన్

చిట్వేలి : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు బ్రాండ్ అంబాసిడర్ అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మలిశెట్టి వెంకటరమణ పేర్కొన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వేలాది మంది పారిశ్రామికవేత్తలు తరలిరావడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పట్ల, ఆయన ప్రభుత్వంపై ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు. సుమారు రూ. 13 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టేందుకు 352 ఒప్పందాలు కుదుర్చుకోవడం పట్ల వెంకటరమణ ఆనందం వ్యక్తం చేశారు.

ఉచిత ఖత్నా కార్యక్రమం

చిన్నమండెం : ఉచిత ఖత్నా కార్యక్రమాన్ని చిన్నమండెం సర్పంచ్ నజీర్‌బాషా, జరీయా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా మైనార్టీ నాయకులు బేపారి మహమ్మద్‌ఖాన్, రాయచోటి మునిసిపల్ వైస్‌చైర్మన్ ఫయాజుర్ రెహమాన్‌లు హాజరయ్యారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆపన్నులకు సేవ చేయడమే మానవత ధ్యేయం



శాంతి రథాన్ని ప్రారంభిస్తున్న రామచంద్రారెడ్డి

గాలివీడు : ఆపన్నులకు సేవ చేయడమే మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ధ్యేయమని సంస్థ వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆపద సమయంలో మేమున్నామంటూ ఓదార్చుటకే మానవత స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేశామని, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలో మానవత సంస్థ సభ్యులు తమ సేవలను అందిస్తున్నారన్నారు. గాలివీడు, చుట్టు పక్కల మండలాలు ఎన్‌పీ కుంట, గాండ్లపెంట, పెద్దమండెం తదితర ప్రాంతాలలో శాంతి రథం సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. సభ్యత్వ నమోదు చేయాలని, స్వచ్ఛందంగా ముందుకు వచ్చే దాతల సహకారం తీసుకోవాలన్నారు. అనంతరం ఈ సమావేశంలో గాలివీడు, కడప జిల్లా కేంద్రానికి చెందిన నియంత్రణ కమిటీ సభ్యులు రామాంజులు రెడ్డి, కడప మానవత ప్రెసిడెంటు సుబ్బారెడ్డి, దాతలు కరిమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి, మానవత రెడ్డన్న, గాలివీడు శాఖ సంస్థ చైర్మన్ సుబ్బారెడ్డి, కన్వీనర్ శివారెడ్డి, డైరెక్టర్ రామకృష్ణారెడ్డి పలువురు సంస్థ సభ్యులు మాట్లాడుతూ సంస్థ ద్వారా దాతల సహకారంతో వివిధ రకాల ఉచిత సేవలు అందించడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం దాత విజయభాస్కర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండలానికి చెందిన డాక్టర్ రామచంద్రారెడ్డి, నరసింహారెడ్డి, రామ్మోహన్ నాయుడు, విశ్వనాథ రెడ్డి, శ్రీనివాసులు, బ్రహ్మానంద రెడ్డి, సిద్దారెడ్డి, రెడ్డన్న, భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు, గాలివీడు మానవత కమిటీ సభ్యులు, మండల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

రాయచోటి అర్బన్ : లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రాయచోటి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మహమ్మద్ పుట్టినరోజును పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలో ఈ శిబిరం జరిగింది. శిబిరాన్ని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు బేపారి మహమ్మద్ ఖాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, వైద్యులు మహేశ్వరరాజులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్లబ్ తరపున నిత్యం సేవా కార్యక్రమాలను చేపడుతుండటం అభినందనీయం అన్నారు. శిబిరంలో 25 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీఎస్ హరినాథరెడ్డి, మాజీ అధ్యక్షుడు చాన్‌బాషా, ఉపాధ్యక్షుడు శివారెడ్డి, హరీష్‌చంద్ర, కార్యదర్శి అహమ్మద్, సభ్యులు వినోద్, రాజశేఖర రెడ్డి, గురుశంకరరెడ్డి, రామ్మోహన్, శంకర్‌రెడ్డి, సాయి, రామాంజులు, ఓబులరెడ్డి, ప్రసాద్, గుణశేఖర్‌రెడ్డితోపాటు వైద్య బృందం పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి లాల్ బహార్ మామిడి పండ్లు



రానా వద్ద మామిడి పండ్లు విక్రయిస్తున్న వ్యాపారి

రాయచోటి టౌన్ : వేసవి అంటేనే అనేక రకాల పండ్ల సీజన్‌గా చెప్పుకొంటారు. వీటిలో రారాజుగా చెప్పుకొనే మండు మామిడి పండు.. అలాంటి మామిడి పండ్లు ఏప్రిల్ రెండవ వారం చివరల్లో మామిడి పండ్లు మార్కెట్‌లోకి వస్తాయి. అలాంటిది ఈ ఏడాది మాత్రం ముందుగానే మార్కెట్‌లోకి వచ్చేశాయి. దీంతో ముందుగా మార్కెట్ చేసుకొంటే కాస్త మంచి డబ్బులు వస్తాయని భావించిన రైతులు పండ్లను కోసి మార్కెట్ చేసుకొంటున్నారు. మామిడిలో ముందుగా మార్కెట్‌లోకి వచ్చేది లాల్‌బహార్ మామిడి కాయలే. మొదట్లో చట్నీ కోసం మార్కెట్ చేసుకొనే వ్యాపారులు ఈ ఏడాది మాత్రం అందుకు భిన్నంగా లాల్ బహార్ మామిడి కాయలను పండ్లుగా, బెంగుళూరు మామిడి కాయలను చట్నీ కోసం మార్కెట్‌లోకి తీసుకొచ్చారు. రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలతోపాటు ఎరువులు, నీరు పెట్టిన తోటలలో ముందుగా లాల్‌బహార్ కాయలు కోత దశలోకి వచ్చాయని వ్యాపారులు అంటున్నారు. అయితే లాల్‌బహార్ మామిడి పండ్లు ధరలను చూస్తే మాత్రం మామిడిపండ్ల ప్రియులకు బెంబేలెత్తిస్తున్నాయి. రాయచోటిలో మామిడి పండ్ల ధరలు కిలో రూ.200కు విక్రయిస్తున్నారు.